క్లుప్తంగా

పేటలో ఎన్నికల ప్రచారానికి తరలిన నేతలు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మండల నాయకులు

ఎస్.రాయవరం : పాయకరావుపేట నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కంబాల జోగులు తొలిసారిగా ఆదివారం ఎన్నికల ప్రచారం ప్రారంభానికి మండల నుంచి ముఖ్య నాయకులు తరలివెళ్లారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ అభ్యర్థిని భారి మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షులు బొలిశెట్టి గోవిందరావు, జెడ్పీటీసీ కాకర దేవి, మాజీ ఎంపీపీ బొలిశెట్టి శారదాకుమారి తదితరులు అన్నారు. ఎన్నిక ప్రచారానికి తరలివెళ్లిన వారిలో మండల నాయకులు మధువర్మ, పోచిన నరేష్,యల్లపు నాగు తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి ఆపరేషన్లకు విశాఖకు వెళుతున్న రోగులు

కోటవురట్ల : ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చినట్టు శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనికుమార్ తెలిపారు. స్థానిక విద్యా వికాస్ స్కూల్ వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు రోగులకు కంటి పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించారు. అశ్వనికుమార్ మాట్లాడుతూ 60 మందిని పరీక్షించగా 30 మందికి కంటి ఆపరేషన్లకు గుర్తించామని తెలిపారు. కంటి నరాల చికిత్సకు ఇద్దరు, కంటి పైపొర చికిత్సకు ఒకరు, కంటి రెప్పల చికిత్సకు ఒకరు, చిన్నపిల్లల కంటి చికిత్సకు ఒకరిని గుర్తించి వారికి శంకర్ కంటి ఆస్పత్రిలో చికిత్స అందించనున్నట్టు తెలిపారు. ఆపరేషన్ల కోసం 30 మందిని ప్రత్యేక బస్సులో విశాఖలోని శంకర్ కంటి ఆస్పత్రికి తరలిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పాపాసాహెబ్, ఆప్తాలమిక్ ఆఫీసర్ సురేష్, నర్సింగ్ స్టాఫ్ దీపిక పాల్గొన్నారు.

కోడిపందాలపై దాడి

ఎస్.రాయవరం : కోనవానిపాలెం శివారు చెరువు వద్ద కోడి పందాలు ఆడుతున్న వారిపై దాడులు నిర్వహించి రెండు కోళ్లు, ఐదుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఈ దాడులు నిర్వహించి, వారి వద్ద నుంచి రూ.1230 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

వైభవంగా పోలిపల్లెమ్మ జాతర



పోలిపల్లెమ్మ తల్లి ఆలయం వద్ద అన్న సమారాధనలో భక్తులు

తుమ్మపాల: మండలంలోని రేబాక గ్రామం శ్రీ పోలిపల్లెమ్మ తల్లి జాతర మహోత్సవంతో పాటు ఆదివారం అమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ పోలిపల్లెమ్మ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిపారు. సాయంత్రం చిన్నపిల్లలకు సైకిల్ పోటీలు నిర్వహించి, గెలుపొందిన చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సేవా సంఘం సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా విజయదుర్గాంబిక ఆలయ వార్షికోత్సవం

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామం కొండకొప్పాకలో విజయదుర్గాంబిక అమ్మవారి దేవాలయం 16వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తెల్లవారు జామునుంచి అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, హోమాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన జరిపారు.

హైస్కూల్ ప్లస్...
ఉన్నత చదువులకు భరోసా

- ఉన్నత పాఠశాలల్లోనే ఇంటర్ విద్య
- హైస్కూళ్ల అప్‌గ్రేడ్‌తో ఫలించిన సంకల్పం
- ప్రతి మండలంలో రెండు ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండేలాచర్యలు



హైస్కూల్ ప్లస్ అమల్లో ఉన్న యలమంచిలి జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంటర్ విద్యార్థులు



జూనియర్ కళాశాలగా అప్‌గ్రేడ్ అయిన అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

యలమంచిలి రూరల్/యలమంచిలి : పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ కోర్సులను అందుబాటులో ఉండాలనే లక్ష్యం అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది.ప్రతి మండలానికి ప్రభుత్వ రంగంలో రెండు జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయడానికి మరో అడుగు వేసింది. డ్రాప వుట్‌ల నివారణ, బాలికా విద్యకు ప్రోత్సహిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గ్రామాల్లో విద్యాభివృద్ధికి చేస్తున్న సంకల్పం ఫలించింది. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో మండలానికి రెండు చొప్పున కళాశాలలు ఏర్పాటయ్యేలా ఇటీవల జీవో నం.14 విడుదల చేసింది. రానున్న విద్యా సంవత్సరానికి హైస్కూళ్లలో ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశ పెట్టాలని ఆదేశాలు ఇచ్చింది. ఈ ప్రకారం యలమంచిలిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల తులసీనగర్‌లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలను రెండేళ్ల క్రితం ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌గా స్థాయి పెంచింది. రాంబిల్లి మండలంలో లాలంకోడూరులో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండగా రాంబిల్లి మండల కేంద్రంలో కేజీబీవీలో ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. అచ్యుతాపురం మండల కేంద్రంలో కేజీబీవీ నడుస్తుండగా అది పూర్తిగా బాలికలకు మాత్రమే కావడం వల్ల అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కో-ఎడ్యుకేషన్ విధానంలో ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశపెట్టింది ప్రభుత్వం. అచ్యుతాపురం మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా స్థానికులు కోరుతున్నారు. గత ప్రభుత్వాలేవి తల్లిదండ్రుల విజ్ఞప్తిని పట్టించుకోలేదు. పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్య ఉచితంగా అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలలో జగనన్న ప్రభుత్వం ఇంటర్మీడియట్ కోర్సులను ప్రవేశపెట్టింది. మునగపాక మండలం పాటిపల్లిలో ఆదర్శ పాఠశాల, కేజీబీవీల్లో ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి.

గతంలో ఇబ్బందులు

గ్రామీణ ప్రాంతాల్లో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ చదివేందుకు సమీపంలోని పట్టణాలకు, లేదా అభివృద్ధి చెందిన గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలకు వెళ్లాల్సి వచ్చేది. ఇది వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉండేది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా తక్కువగా ఉండడం వలన కష్టమైనా, ఆర్థికంగా భారమైనా ప్రైవేట్ కాలేజీలను ఆశ్రయించాల్సి వచ్చేది. తద్వారా చాలా మంది విద్యార్థులు ముఖ్యంగా బాలికలు పదో తరగతి తర్వాత పై చదువులకు వెళ్లే వారు కాదు. ఈ సమస్య పరిష్కారం కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి గ్రామీణ ప్రాంతాల్లో కాలేజీ చదువులకు పెద్ద పీట వేయాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా రెండేళ్ల క్రితం ప్రతి మండలంలోని మోడల్ స్కూల్ , కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు. దీంతో పాటు మండలానికి రెండు కాలేజీలు చొప్పున ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో కొత్తగా అచ్యుతాపురం జెడ్పీ హైస్కూల్లో ఇంటర్మీడియట్ కోర్సుకు (కో ఎడ్యుకేషన్) ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. వచ్చే జూన్ నుంచి ఈ కాలేజీలో ఇంటర్మీడియట్ తరగతులు మొదలు కానున్నాయి.

తల్లిదండ్రుల హర్షం :

నాడు -నేడు కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లలా మారాయి. పాఠశాల స్థాయిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడం అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు పెంచేందుకు డిజిటల్ తరగతులు నిర్వహించడం , బైజూస్ పాఠాలు అందుబాటులోకి రావడం కొత్తగా ఐఎఫ్‌పీల ద్వారా విద్యాబోధన ప్రారంభించడం వంటి విప్లవాత్మక మార్పులన్నీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ప్రారంభమయ్యాయి. వాటికితోడు కాలేజీ చదువులకు సైతం ప్రభుత్వం కొత్తరూపు కల్పించడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యకు అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోంది. ప్రతి మండలంలో కో-ఎడ్యుకేషన్‌తో పాటు బాలికలకు ప్రత్యేకంగా ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ప్లస్‌టూ పాఠశాలలుగా స్థాయిని పెంచుతోంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆయా పాఠశాలలు ప్లస్‌టూ పాఠశాలలగా మారనున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి అచ్యుతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఇంటర్మీడియట్ కోర్సు అందుబాటులో ఉంటుంది. దీని వల్ల పేద విద్యార్థులకు ఇంటర్మీడియట్ ఉచిత విద్య అందుబాటులోకి వచ్చినట్లయింది.

–పి.అప్పారావు, ఉప విద్యాశాఖాధికారి, యలమంచిలి

విద్యార్థులకు మంచి అవకాశం



నియోజకవర్గంలో మండలానికి రెండు చొప్పున ప్రభుత్వ రంగంలో ఇంటర్మీడియట్ కోర్సులు అందుబాటులో ఉంచడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టడం విద్యార్థులకు వరం లాంటిది. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. యలమంచిలిలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రెండేళ్లుగా ప్లస్‌టూ అమలవుతోంది. బాలికలకు ఉన్నత విద్యను అందించేందుకు ప్రభుత్వం మంచి అవకాశం కల్పించింది. ఇకపై ఈ ప్రాంత విద్యార్థులకు ఇక్కట్లు తగ్గినట్లే.

–బోదెపు గోవింద్, ఎంపీపీ, యలమంచిలి

స్కూళ్లలోనే ఇంటర్ విద్య



2022–23 నుంచి మా పాఠశాలను ప్రభుత్వం హైస్కూల్ ప్లస్‌గా స్థాయిని పెంచింది. ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో బాలికలకు ప్రవేశాలు కల్పించాం. ఇటీవల ప్రభుత్వం 2024–25 విద్యా సంవత్సరానికి మరిన్ని పాఠశాలలను హైస్కూల్ ప్లస్‌గా అప్‌గ్రేడ్ చేసింది. నాణ్యమైన ఇంటర్మీడియట్ విద్యను అందిస్తున్నాం. ఇక్కడ చదువుతున్న బాలికలు మరిన్ని ఉన్నత చదువులు అభ్యసించేలా తీర్చిదిద్దుతున్నాం. పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలి.

–హిమబిందు, హెచ్ఎం తులసీనగర్, బాలికోన్నత పాఠశాల, యలమంచిలి

గవర్ల అనకాపల్లిలో రేపు పోలిపల్లెమ్మ పండగ



గవర్ల అనకాపల్లిలోని పోలిపల్లెమ్మ

మునగపాక : మండలంలోని గవర్ల అనకాపల్లి ఏటీ బ్రిడ్జి వద్ద ఈ నెల 26న పోలిపల్లెమ్మ పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ బుద్ద రవిశంకర్ తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 11 గంటలకు కోలాటం ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు భారీ అన్న సమారాధన జరుగుతుందన్నారు. సాయంత్రం 5 గంటలకు అమ్మవారి ఘటాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని రవిశంకర్ కోరుతున్నారు.

పైడిమాంబ ఆలయ నిర్మాణ పనులకు విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటరావు

రాంబిల్లి: మామిడివాడలో పైడిమాంబ ఆలయ నిర్మాణ పనులకు మోటూరి వెంకటరావు రూ 50,400 విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు నెట్టెం సత్యన్నారాయణకు ఈ విరాళాన్ని అందజేశారు. దాతల విరాళాలతో పైడిమాంబ ఆలయాన్ని నిర్మించారు. ఈ నెల 28న ఈ ఆలయాన్ని ప్రారంభించి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ట చేయనున్నారు. ఇందులో భాగంగా మంగళ వారం నుంచి హోమం, పూజలు ప్రారంభం కానున్నాయి.

క్షయవ్యాధిపై అవగాహన అవసరం



కొక్కిరాపల్లి అంబేడ్కర్ బాలికల గురుకులంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు



శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది క్షయ వ్యాధి నిర్మూలనపై చేపట్టిన ర్యాలీ

యలమంచిలి రూరల్ : ప్రాణాంతక క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కొక్కిరాపల్లి అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.మాణిక్యం అభిప్రాయపడ్డారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా విద్యాలయంలో క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు, టీచర్లు, సిబ్బంది పాఠశాల అవరణలో ర్యాలీ చేపట్టారు. క్షయవ్యాధి నివారణకు సంబంధించి నేను క్షయను నివారించగలను, క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ వ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చు..అనే నినాదాలు విద్యార్థులతో చేయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్షయ రహిత సమాజం కోసం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. అయినప్పటికీ కొందరు వ్యాధిగ్రస్తులు మందులు సక్రమంగా వాడకపోవడం వల్ల వ్యాధి మొండి క్షయగా రూపాంతరం చెందుతోందన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాణిక్యం మాట్లాడుతూ మూడు వారాలపాటు దగ్గు ఉండడం, రక్తంతో కూడిన కఫం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, తరచుగా జ్వరం రావడం, ఆకలి మందగించడం, అలసట, నీరసంగా ఉండడం, రాత్రి పూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే సమీపంలోని వైద్యులను సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలన్నారు. వ్యాధి ఉన్నట్టు నిర్ధారణ అయినా ఆందోళన చెందకుండా ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా అత్యాధునిక వైద్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎం ఎం.విజయలక్ష్మి, సంగీతం ఉపాధ్యాయురాలు హరిణి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేట : ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా మండలంలో గల శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి సోకకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, క్షయ వ్యాధి సోకిన తర్వాత తీసుకోవలసిన వైద్యంపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కావ్య ఆధ్వర్యంలో శ్రీరాంపురం గ్రామంలో ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎంపీహెచ్ఈవో ఆర్.జె. బాలాజీసింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు.

లక్ష్మీనారాయణస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనారాయణ స్వామి

మాడుగుల రూరల్: ఎం.కోడూరులో లక్ష్మీనారాయణ స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక తాచేరు నది ఒడ్డున చక్రస్నానం, నాగవల్లి సంబరాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాలు సోమవారంతో ముగిస్తున్నాయని ఆలయ కమిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. అదే రోజు ఉదయం నుంచి స్వామి వారికి పూజలు, రాత్రికి స్వామి వారి ఊంజల్ సేవ, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిస్తాయన్నారు.

పూతదశలో నువ్వు సాగు

కె.కోటపాడు: మండలంలో నువ్వు పంట పూతదశకు చేరుకుంది. ఖరీఫ్ వరి కోతలు పూర్తయిన తర్వాత రబీ సాగుగా నువ్వు పంట పండిస్తున్నారు. ప్రధానంగా నీటి లభ్యత ఉన్న వ్యవసాయ బావులు, సాగునీటి చెరువుల ఆధారంగా డి.అగ్రహారం, గుల్లేపల్లి, రామచంద్రపురం, కింతాడ, పిండ్రంగి, పోతనవలస, ఆర్లి, చౌడువాడ, ఎ.భీమవరం, పాడుగుపాలెం , పైడంపేట, రొంగలినాయుడుపాలెం, తదితర గ్రామాల్లో 200 ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

వేడుకగా మట్టల ఆదివారం

కశింకోట: స్థానిక క్రైస్తవులు మట్టల ఆదివారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంతబయలలోని ఆంధ్ర కల్వరి సెంటినరీ బాప్టిస్టు చర్చి, గవరపేటలోని ఏసుక్రీస్తు ప్రార్థన మందిరంల ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలను సంప్రదాయంగా పూలతో అలంకరించి, గ్రామ వీధుల్లో క్రీస్తు గీతాలాపనతో వేర్వేరుగా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో బాప్టిస్టు చర్చి పాస్టర్ సన్నీ జేమ్స్, సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజిమెన్ తదితరులు పాల్గొన్నారు.

వానర మూకతో బెంబేలు



కె.జె.పురం -దబ్బకుంటు రోడ్డులో కోతుల గుంపు

మాడుగుల రూరల్: మండలంలో కోతులు వీరవిహారం చేస్తున్నాయి. ప్రధానంగా కె.జె.పురం నుంచి దబ్బకుంటు రహదారిలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒంటరిగా వెళ్లే మహిళల మీద దాడి చేసి గాయపరుస్తున్నాయి. పాకల వద్దకు భోజనాలు తీసుకెళ్తుండగా దాడి చేసి వాటిని తినివేస్తున్నాయని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పొలాల్లో పంటలను చెరకు తోటల్లో గడలను, కొబ్బరి పిందెలను పనస కాయలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకల వద్దకు వెళ్లే వారిపై దాడులు చేస్తున్నాయని రైతులు బుద్దా అప్పారావు, కాళ్ల సూరిబాబు, పొలమరశెట్టి కోటేశ్వరరావు, బుద్ద నాగేశ్వరావు, కాళ్ల వెంకట్రావు, మళ్ల సూరిబాబు, జగ్గారావు, భీశెట్టి సూర్యనారాయణ వాపోతున్నారు. దీంతోపాటు మాడుగుల మోదమాంబ కాలనీ, ఘాట్‌రోడ్డు జంక్షన్, సురవరం, తాటిపర్తి ప్రధాన రహదారిలో కోతుల గుంపులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో పండ్లు, కాయగూరల దుకాణాల్లో చొరబడి వాటిని తినివేస్తున్నాయని వాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వీటి నివారణకు అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు చొరవ చూపాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షిణ

ఘనంగా ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



స్వామివారికి పల్లకి సేవ చేస్తున్న భక్తులు

రోలుగుంట: వెంకన్న కల్యాణోత్సవాలు ఆదివారం గిరి ప్రదక్షిణతో ముగిశాయి. తొలుత స్వామివారిని రథంపై ఉంచి స్థానిక కొండ దిగువన కోనేటి నుంచి ఉదయం 7 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. స్థానిక ఆస్పత్రి, ఆర్అండ్‌బీ రోడ్డులో చెరకు కాటా మీదుగా నిండుగొండ, అక్కడ నుంచి కె.నాయుడుపాలెం చేరుకున్నారు. అక్కడ నుంచి కొవ్వూరు నూకాలమ్మ గుడి మీదుగా కొండపైన వేంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఆరు కిలోమీటర్ల మేర భక్తులు గోవింద నామస్మరణతో పల్లకి సేవ చేసి గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం కల్పించారు. అర్చకుడు రేజేటి శ్రీనివాసశర్మ చక్రస్నానం చేయించారు. 300 మందికిపైగా భక్తుల గోత్ర నామాలతో అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమాలకు ముత్యాల రామస్వామి కుటుంబీకులు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు.

ఆరంభంలో గుర్తిస్తే క్షయ నివారణ సులభం

కశింకోట: ప్రారంభ దశలో గుర్తించి, చికిత్స అందిస్తే క్షయ వ్యాధిని నివారించవచ్చని తాళ్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి యు.రమేష్ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య సిబ్బంది ఆదివారం అవగాహన ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ 2 వారాలకు పైగా దగ్గు, జ్వరం, కఫంలో రక్తం పడుట, క్రమేపీ బరువు తగ్గడం తదితర అనుమానిత లక్షణాలున్న వారు సమీపంలోని పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు అందస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 2వ వైద్యాధికారి ఎ.మనీషా, ఆరోగ్య బోధకుడు ఎంఎస్‌వీ ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ కేఎస్ఆర్‌కేజీ నర్సింహారావు, ఎస్టీఎల్ఎస్ పి.రాధిక, టీబీ హెచ్‌వీ ఐ.రోజా రమణి, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



కొరుప్రోలు మట్టల ఆదివారంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



కోటవురట్ల కేకేజీ చర్చి వద్ద మట్టలతో చిన్నారులు

ఎస్.రాయవరం : మండలంలో మట్టల ఆదివారం వేడుక ఘనంగా నిర్వహించారు. కొరుప్రోలు, ఎస్.రాయవరం, దార్లపూడి, పెదగుమ్ములూరు, పెదఉప్పలం తదితర గ్రామాల్లో క్రైస్తవ సోదరులు ఆధ్వర్యంలో చిన్నారులు ఈత కొమ్మలకు రంగుల పుష్పాలు అలంకరించి వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

కోటవురట్ల : మండలంలో మట్టల ఆదివారాన్ని క్రైస్తవులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చి వద్ద సండే స్కూల్ విద్యార్థులు మట్టలకు పూలు అలంకరించి సందడి చేశారు. రాట్నాలపాలెం నుంచి చర్చి వరకు ర్యాలీ నిర్వహించారు. సండే స్కూల్ సూపరింటెండెంట్ సంగీత్‌రాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు దేవాలయంలోకి ప్రవేశించిన రోజును మట్టల ఆదివారంగా జరుపుకొంటారన్నారు. ఏసుక్రీస్తు బోధనలు శాంతి మార్గాన్ని ప్రబోధిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ టీచర్స్ జి.ఎ.భవాని, బి.టి.ఆర్.ప్రసాద్, ఎస్.మెలోడీ, ఎం.ఐశ్వర్య పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఉత్సవమూర్తి ఊరేగింపు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోపూజ చేస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లి: స్థానిక మెయిన్‌రోడ్డు శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అమ్మవారి ప్రతిష్ట శతజయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 2వ పౌర్ణమి పురస్కరించుకుని విశేష పూజలు జరిపారు. నగర సంకీర్తన, గోపూజ, ప్రదక్షిణలు, అమ్మవారి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, నవకలశ స్నపనము, నీరాజన మంత్ర పుష్పములు, తీర్థ ప్రసాదాలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. తెల్లవారు జామున అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో శతజయంతి ఉత్సవం చైర్మన్ కొరుకొండ బుచ్చిరాజు, కో చైర్మన్ డాక్టర్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణ కుమార్, కార్యదర్శి కొరుపోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్ వుప్పల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా ఆహారపు అలవాట్లు



రోగిని పరీక్షిస్తున్న హోమియో వైద్యుడు

అనకాపల్లి: మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లలో మార్పులు చేసుకోవాలని ప్రముఖ హోమియో వైద్యుడు విల్లూరి జోగినాయుడు, దంత వైద్యురాలు సంజన సూచించారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం ఉచిత హోమియో, దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా వంటి విపత్తుల తరువాత హోమియో వైద్యంపై ప్రజలకు నమ్మకం పెరిగిందన్నారు. రహదారులపై ఫాస్ట్‌ఫుడ్‌లు తీసుకోవడం ద్వారా పలు వ్యాధులకు గురయ్యే పరిస్థితి వస్తోందన్నారు. వారానికి రెండు సార్లు ఆకుకూరలు, కూరగాయలు, తాజా పండ్లు తీసుకుంటే ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని చిన్నపిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లే సమయంలో తాగునీటిని తీసుకువెళ్లాలన్నారు. ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ప్రతి ఆదివారం ఇదే ప్రాంతంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీజే నాయుడు, రోటరీ గవర్నర్ బుద్ద రమణాజీ, కార్యదర్శి ఆడారి రామకృష్ణ, కోశాధికారి రాపేటి నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు.